సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



నిర్ణయం సంతోషకరం

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం హర్షణీయమని రమేష్ అన్నారు. 8లో▸



గంజాయి ముఠా అరెస్ట్

అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను శంషాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో▸



నియామకం

తెలంగాణ కబడ్డీ సంఘం (టీకేఏ) మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా డి.రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. 8లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తులన్నీ స్వీకరించాలి

జిల్లా ప్రత్యేకాధికారి టీకే శ్రీదేవి



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి టీకే శ్రీదేవి

కొత్తూరు: ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాపాలన ప్రత్యేకాధికారి టీకే శ్రీదేవి అన్నారు. శనివారం ఆమె మున్సిపల్ పరిధిలో పలువార్డుల్లో ఏర్పాటు చేసిన దరఖాస్తు కేంద్రాలను పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకన్నారు. దరఖాస్తుల స్వీకరణలో అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ఏ దరఖాస్తు ఇచ్చినా తప్పక స్వీకరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. దరఖాస్తులకు రేషన్‌కార్డు ప్రామాణికం కాదని ప్రజలు గ్రహించాలన్నారు. రేషన్‌కార్డులు లేని పక్షంలో ఆధార్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరేందర్, నాయకులు దేవేందర్‌యాదవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సెర్ప్' సహకారంతో ఆస్పత్రి అభివృద్ధి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

షాబాద్: షాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెర్ప్ ఆర్గనైజేషన్ సహకారంతో చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించామన్నారు. షాబాద్ ఆస్పత్రిని సైతం అభివృద్ధి చేసేందుకు సెర్ప్ ఆర్గనైజేషన్ ముందుకు వచ్చిందని వివరించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. షాబాద్ ఆస్పత్రి ఆవరణ, భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉందని, మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది గోపాల్, శంకర్ తదితరులున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

షాద్‌నగర్: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని ట్రాఫిక్ పీఎస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరం వేడుకలు ఆనందంగా నిర్వహించుకోవాలని సూచించారు. డిసెంబర్ 31 వేడుకల సందర్భంగా శంషాబాద్, షాద్‌నగర్ డివిజన్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపడుతున్నాయని వివరించారు. రాత్రి 10 గంటల నుంచి జనవరి 1న ఉదయం ఆరు గంటల వరకు ప్రధాన కూడళ్లు, జంక్షన్ల వద్ద విస్తృత తనిఖీలుంటాయన్నారు. స్పీడ్‌గన్‌ల సాయంతో వేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి వాహనదారుడిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు నేడు రేపు సెలవు

సాక్షి, సిటీబ్యూరో: ఆది, సోమవారాల్లో ప్రభుత్వ సెలవు దినాలైనందున అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ ఉండదని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. శనివారం జీహెచ్‌ఎంసీ పరిధిలోని కొన్ని కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తిరిగి జనవరి 2 నుండి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలందరికీ అందేలా 40 లక్షల దరఖాస్తులు ముద్రించామని, ప్రజలెవరూ వాటిని కొనవద్దని, ఎవరూ కూడా విక్రయించ వద్దని సూచించారు. దరఖాస్తులు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు.

కలం బలం.. జనం గళం!

- 'సాక్షి' కథనాలకు స్పందించిన యంత్రాంగం
- సమస్యలకు పరిష్కారం చూపిన వైనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బాధిత పక్షమనేలా 'సాక్షి' తనదైన పాత్రను ఈ ఏడాదంతా పోషించింది. అధికార పక్షం నుంచి ఎదురైన ఒత్తిళ్లను తట్టుకుని ధైర్యంగా పీడిత, తాడిత వర్గాల పక్షాన నిలిచింది. భూ ఆక్రమణలు.. ప్రభుత్వ శాఖల్లో ఎక్కడ అవినీతి ఉంటే అక్కడ కలం బలాన్ని గళమెత్తి వినిపించింది. ఎన్నో ఇక్కట్లకు పరిష్కార మార్గాన్ని చూపించింది. ఆవేదనతో తల్లడిల్లిన వారికి అండగా నిలిచింది. కబ్జాదారుల హస్తాల్లో చిక్కుకున్న విలువైన ప్రభుత్వ భూములకు విముక్తి కల్పించింది. ఏళ్లనాటి వెతలను కథనాలుగా ప్రచురిస్తూ అధికార యంత్రాంగంలోనూ కదలిక తెప్పించింది. నాసిరకం పనుల గుట్టును బయటపెట్టి.. గుత్తేదారుల గుండెల్లో వణుకు పుట్టించింది. పాలకులను మెప్పించి, నిధులు రప్పించే విషయంలోనూ కీలక పాత్ర పోషించింది. జనహితమే..అభిమతమనేలా ఈ ఏడాదిలో ఎన్నో స్పందనలను సాధించింది. డిసెంబర్ 31తో 2023 ముగియనున్న నేపథ్యంలో ప్రజల పక్షాన నిలిచి.. సాధించిన విజయాల్లో కొన్నింటి సమాహారం.



బడిపిల్లలకు భరోసా

ప్రభుత్వ పాఠశాలతో పాటు కేజీబీవీ, గురుకుల, ఇతర వసతి గృహాల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమి, నాసిరకం భోజనం వడ్డింపు అంశాలపై 'సమస్యల నిలయాలు.. అద్దె భవనాలే దిక్కు.. గీ బువ్వ తినలేం'.. వణుకుతున్న వసతి గృహాలు.. వంటి శీర్షికలతో వరుస కథనాలు ప్రచురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అంతేకాదు కేజీబీవీ స్కూళ్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లి.. పనుల్లో వేగం పెంచేలా చేసింది. టీచర్లలేమిపై తడ'బడి' శీర్షికన కథనం ప్రచురించి తాత్కాలిక చర్యలకు తోడ్పంది. వేళకు బస్సులు రాక గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఆర్టీసీ బస్ సర్వీసు.. తుస్' శీర్షికన కథనం ప్రచురించి, ఆయా రూట్లలో వేళకు బస్సులు నడిచేలా చర్యలు చేపట్టింది. గుర్తింపు లేకుండా గుట్టుగా చేపడుతున్న అడ్మిషన్ల భాగోతంపై వరుస కథనాలు ప్రచురించి, పలు ప్రైవేటు విద్యాసంస్థలకు నోటీసులు జారీ చేయించింది.

భూములకు రక్షణ

ప్రభుత్వ భూముల పరిరక్షణ దిశగా సాగించిన అక్షర పోరులో సాక్షి విలువైన ప్రజల ఆస్తిని పరిరక్షించింది. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు, వెంచర్లలో ప్రజావసరాల కోసం వదిలిన పార్కులు, క్రీడా స్థలాలను కబ్జాదారుల బారీ నుంచి కాపాడింది. భూముల క్రమబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 58, 59ల మాటున జరిగిన అక్రమాలను వెలుగులోకి తెచ్చింది. కుంట్లూరు, పసుమాముల, హస్మగల్, హయత్‌నగర్, కందుకూరు, తట్టిఅన్నారం, శేరిలింగంపల్లి, శంషాబాద్‌లోని ప్రభుత్వ భూముల ఆక్రమణలు.. అడ్డదారుల్లో క్రమబద్ధీకరించుకున్న వైనాన్ని వెలుగులోకి తెచ్చింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇందుకు సహకరించిన రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఉద్యోగుల అవినీతిని ఎండగట్టింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టిన అధికారులను ఏసీబీకి పట్టించడంలో బాధితుల పక్షాన నిలిచి సహకరించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన దళిత బంధు, బీసీ బంధు నిధులు పక్కదారి పట్టిన వైనంతో పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు, ఇంటి స్థలాల పంపిణీలో చోటు చేసుకున్న అక్రమాలను వెలుగులోకి తెచ్చింది. అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిన ప్రతిసారి వారికి అండగా నిలిచింది.

మైనింగ్ బాధితులకు అండగా

అబ్దుల్లాపూర్‌మెట్, బండరావిరాల, చిన్న రావిరాల మైనింగ్ జోన్‌లో 40 మైన్స్, 17 క్రషర్ల ఏర్పాటు సహా, యాచారం, కొత్తూరు, తలకొండపల్లి, గండిపేట, కడ్తాల్, తదితర ప్రాంతాల్లో అక్రమ మైనింగ్, క్రషర్ల ఏర్పాటుతో పర్యావరణానికి, జీవరాశికి జరుగుతున్న హానిపై 'మైనింగ్ మాఫియా'.. 'కొండలు పిండి' .. 'వద్దన్నా వినరే..''రాయల్టీ ఎగ్గొట్టి..' వంటి శీర్షికలతో వరుస కథనాలు ప్రచురించింది. మైనింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు అండగా నిలిచి సమస్య పరిష్కారంలో ముందుంది. పారిశ్రామిక వాడలు, రియల్ ఎస్టేట్ వెంచర్ల పేరుతో ప్రభుత్వం జిల్లాలో పెద్ద ఎత్తున భూమిని సేకరించింది. చందనవెల్లి, ముచ్చర్ల, యాచారం ఫార్మాసిటీ, కొత్తూరు పారిశ్రామిక వాడల్లో భూములు కోల్పోయిన భూ బాధితుల గొంతుకగా నిలబడింది. బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యం, అక్రమాలను వెలుగు తీసి, అర్హులకు న్యాయం చేయడంలో విశేష కృషి చేసింది.



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో కలెక్టర్‌లు నారాయణరెడ్డి, గౌతమ్ పొట్రు

పేదల సంక్షేమానికే 'ప్రజాపాలన'

- ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- హాజరైన ప్రజాప్రతినిధులు, స్పెషల్ ఆఫీసర్లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రతీ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజా పాలన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నిరుపేదల సమస్యలను పరిష్కరించి.. వారి సంక్షేమం కోసమే ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించామన్నారు. తమ ప్రభుత్వం దళారుల ప్రమేయం లేకుండా పారదర్శక పాలన అందిస్తుందన్నారు. అభయ హస్తం పథకాల దరఖాస్తులకు ప్రజలకు అందుబాటులో ఉంచాలని సంబంధిత స్పెషల్ అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని.. జిరాక్స్ కేంద్రాల వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా దరఖాస్తులు విక్రయిస్తే వారిపనై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. వృద్ధులకు, దివ్యాంగులకు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఆరు గ్యారంటీలను వీలైనంత త్వరగా అమలు చేసేందుకు ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేశామని.. ఉచిత బస్సు ప్రయాణంతో పనిచేసే మహిళా కుటుంబానికి నెలకు రూ.3వేల వరకు ఆదా అవుతోందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితి రూ.10లక్షలకు పెంచడంతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు.



సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

రేషన్ కార్డుకు దరఖాస్తు రాయించుకోండి

రేషన్ కార్డులకు కోసం, రెవెన్యూ సంబంధిత సమస్యలు తదితరాలపై దరఖాస్తు చేసుకునే వారి కోసం తెల్ల కాగితంపై దరఖాస్తును రాయించుకుని వారికి రసీదు అందజేయాలని మంత్రి సూచించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని శాసన సభ్యులతో, స్పెషల్ ఆఫీసర్లతో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించే సమయంలో ఎదుర్కొనే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలనలో కార్యక్రమ అమలు చేసేందుకు ప్రభుత్వ అధికారుల కృషి అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనిత, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి, మేడ్చల్ జెడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎస్‌ఎన్ రెడ్డి, శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, సుధీర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు, వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, అభిషేక్, సైబరాబాద్ డీసీపీ నారాయణ, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఆర్డీఓలు, స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

గ్లోబల్ హెడ్ క్వార్టర్‌గా పత్రీజీ శక్తిస్థల్

- పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళపత్రి
- నేటితో ధ్యాన మహాయాగాలు ముగింపు

కడ్తాల్: మహేశ్వర మహాపిరమిడ్‌లోని పత్రీజీ శక్తిస్థల్ గ్లోబల్ హెడ్ క్వార్టర్‌గా విరాజిల్లబోతోందని పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ (పీఎస్ఎస్ఎం)గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి అన్నారు. పత్రీజీ ధ్యాన మహాయాగాలు శనివారంతో పదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పరిమళ పత్రి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది డిసెంబర్‌లో నిర్వహించే పత్రీజీ మహిళా ధ్యాన మహాయాగ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు కృషి చేయాలని కోరారు. అనంతరం పరిణిత పత్రి మాట్లాడుతూ.. బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ ఆత్మజ్ఞాన గ్రంథాల సారాంశాన్ని ప్రజలందరికీ పంచాలని కోరారు.

'పత్రీజీ శక్తిస్థల్'కు సహకరించండి

పత్రీజీ శక్తిస్థల్‌ను ప్రపంచ స్థాయిలో నిలిచేలా నిర్మించడమే తన ధ్యేయమని.. ఇందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ధ్యాన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంగా వర్ధిల్లనుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గురువులు ఆధ్యాత్మిక, ధ్యాన సందేశాన్ని వినిపించారు. కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ హనుమంతరాజు, సాంబశివరావు, శ్రీరాంగోపాల్, రాంబాబు, దామోదర్‌రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ బాలకృష్ణ, పీఎంసీ డైరెక్టర్ నవకాంత్, ఆనంద్, లక్ష్మీ, జయశ్రీ, దామోదర్‌రెడ్డి, మాధవి, ఆనంద్, మారం శివప్రసాద్, గణేశ్ తదితరులున్నారు.

రూ. 3వేల కోట్లతో అభివృద్ధి చేస్తా!

- కోట్‌పల్లికి భారీగా నిధులు తీసుకువస్తా
- బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్వీర్యం చేసింది
- యువతకు ఉపాధి చూపుతాం
- శాసనసభ స్పీకర్ జి. ప్రసాద్‌కుమార్

ధారూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.3వేల కోట్ల వరకు నిధులు తెచ్చి, జిల్లాను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద బోటింగ్‌ను ప్రారంభించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సృజల స్రవంతి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేవెళ్లకు తీసుకువచ్చారని, మాజీమంత్రి సబిత, రాంమోహన్‌రెడ్డి, నేను కలిసి ప్రాజెక్టు పరిధిని తాండూరు, పరిగి, వికారాబాద్ వరకు విస్తరించేలా చేశామన్నారు.

నీటిని అడ్డుకున్న బీఆర్‌ఎస్

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా శంకర్‌పల్లిలో రూ.1,300 కోట్లతో పని జరిగిందని స్పీకర్ ప్రసాద్ కుమార్ తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సర్వే చేయించడానికి రూ.7 కోట్లు తీసుకువచ్చామన్నారు. జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో గ్రావిటి ద్వారా అంతటికీ విస్తరించాలని భావించామని పేర్కొన్నారు. రెండు ప్రాజెక్టుల నీరు జిల్లాకు రాకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుట్ర చేసిందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు నీటిని రప్పించడానికి సీఎంతో చర్చిస్తామని పేర్కొన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో కోట్‌పల్లికి రూ.20 కోట్ల నిధులు మంజూరుచేసి పనులు చేయించామని, తర్వాత బీఆర్‌ఎస్ పట్టించుకోలేదని విమర్శించారు. ప్రాజెక్టుకు ఏం చేస్తే పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందుతుందో, ఆ విధంగా రిపోర్టు తయారు చేయాలని ఇరిగేషన్ ఈఈ సుందర్‌ను ఆయన ఆదేశించారు.



బోటింగ్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతకు రూ.200 కోట్లు

అనంతగిరిగుట్ట అభివృద్ధి కోసం నాడు మంత్రిగా ఉన్నప్పుడు రూ.220 కోట్లు తీసుకువస్తే.. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఈకో టూరిజంలో భాగంగా రూ.200 కోట్లు తీసుకువచ్చి అభివృద్ధి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఉపాధి కల్పనకు ప్రాధాన్యం

బోటింగ్ ద్వారా యువత, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని స్పీకర్ వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణలో 50 లక్షల వరకు నిరుద్యోగులు ఉన్నారని, కేవలం 2 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు.

చేపల సంఘాన్ని విస్తరించాలి

కోట్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న వారిని చేపల సంఘంలో చేర్చి, అందరికీ లబ్ధిచేకూరేలా చూడాలని మత్స్యశాఖ జిల్లా అధికారి చరితారెడ్డికి స్పీకర్ సూచించారు.

జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకే..

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

నందిగామ: నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకే భారత ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శనివారం ఆమె నందిగామ సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణులకు అవగాహన లేక పథకాలు అందుకోలేక పోతున్నారని.. అందుకోసమే ఈ యాత్రను చేపట్టి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అధికారులు సైతం ప్రజలకు సేవలందించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అందె బాబయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, వంశీ కృష్ణ, శ్రీను, వెంకటేశ్, ప్రవీణ్, అరవింద్ చారి, మోహన్, హరిభూషన్, శ్యాంసుందర్, శివ, రాజు, వివేక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీకే అరుణ

విమానం టికెట్ ఉంటేనే ఔటర్ పైకి!

సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో విమాన టికెట్ ఉన్న ప్రయాణికులకు మాత్రమే ఔటర్ రింగ్ రోడ్డు, పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే మీదకు అనుమతి ఉంటుంది. ఆదివారం రాత్రి 10 గంటల నుంచి జనవరి 1న ఉదయం 5 గంటల వరకు విమానాశ్రయం వెళ్లే వాహనాలకు తప్ప ఇతర లైట్ మోటార్ వాహనాలకు అనుమతి లేదు. ఈ మేరకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. అలాగే రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు శిల్పా లేఅవుట్, గచ్చిబౌలి, బయో డైవర్సిటీ, షేక్‌పేట్, మైండ్ స్పేస్, రోడ్ నెం.45, సైబర్ టవర్, ఫోరమ్ మాల్- జేఎన్‌టీయూ ఖైత్లాపూర్, బాబు జగ్జీవన్ రామ్ ఫ్లై ఓవర్లతో పాటు దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ మూసి ఉంటాయని తెలిపారు.

ఎక్కువ చార్జీలపై ఫిర్యాదు చేయండి..

క్యాబ్‌లు, టాక్సీ, ఆటో డ్రైవర్లు కచ్చితంగా యూనిఫామ్ ధరించాలి. క్యాబ్ డ్రైవర్లు రైడ్ నిరాకరించకూడదని, ఇది మోటారు వాహనాల చట్టం, 1988లోని సెక్షన్ 178 ప్రకారం ఉల్లంఘన కిందికే వస్తుందని, అలాంటి వారిపై రూ.500 జరిమానా ఉంటుందని హెచ్చరించారు. అదనపు చార్జీలను వసూలు చేస్తే 9490617346 వాట్సాప్ నంబరులో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్


మాట్లాడుతున్న ఉద్యమకారులు

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం హర్షనీయమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి రమేష్, ఉద్యమనేత కేబుల్ రాజు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన వారిని గుర్తించి 250 గజాల ఇంటి స్థలం ఇవ్వడానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పిన ప్రభుత్వ నిర్ణయం సంతోషకరమన్నారు. ఉద్యమంలో ఎన్నో కేసులు ఎదుర్కొని ఇబ్బందులకు గురయ్యామన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నా రు. సమావేశంలో మహిపాల్, జగన్, అవినాష్, ముకుందరెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

హైదరాబాద్ జేటీసీగా రమేష్



- పరిపాలన విభాగానికి పాండురంగ్ నాయక్ బదిలీ
- చెక్ పోస్టు ఓడీలను రద్దు చేసిన సర్కార్
- రవాణాశాఖలో సమూల ప్రక్షాళన
- త్వరలో పూర్తిస్థాయి బదిలీలకు సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా సి.రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం హైదరాబాద్ జేటీసీగా ఉన్న పాండురంగ్‌నాయక్ రవాణా కమిషనర్ కార్యాలయంలోని పరిపాలన విభాగం జేటీసీగా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఐటీ బాధ్యతలను పర్యవేక్షించిన రమేష్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. మరోవైపు పరిపాలన విభాగం బాధ్యతలను పర్యవేక్షించిన జేటీసీ మమతా ప్రసాద్‌ను ఐటీ విభాగానికి బదిలీ చేశారు. రవాణాశాఖలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు కొంతకాలంగా బదిలీలు, పదోన్నతులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో కొత్తగా బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రవాణాశాఖపై సీరియస్‌గా దృష్టి సారించింది.గతంలో చోటుచేసుకున్న అక్రమాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్నతస్థాయిలో బదిలీలు చేపట్టారు.త్వరలో అన్ని విభాగాల్లోనూ బదిలీలతోపాటు, సమూల ప్రక్షాళన చేయనున్నట్లు సమాచారం. కొందరు అధికారులు, ఉద్యోగులు ఏళ్లతరబడి ఒకేచోట పని చేస్తుండడంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా దళారులు, ఏజెంట్ల కార్యకలాపాలు వ్యవస్థీకృతంగా మారాయి. వాహనదారులకు అందజేసే వివిధ రకాల పౌరసేవల్లో పారదర్శకత లోపించింది. మరోవైపు రహదారి భద్రత వంటి కీలకమైన విధులను కూడా కొందరు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ క్రమంలో సమూల మార్పులను చేపట్టినట్లు రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

ఓడీలు ఔట్...

ఆన్‌డెప్యుటేషన్ (ఓడీ)లపై వెళ్లి చెక్‌పోస్టుల్లో పని చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల ఓడీలను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు వారు తమ సొంత ప్రాంతీయ రవాణా కార్యాలయాలు, డ్రైవింగ్ టెస్ట్ కేంద్రాలు, ఎంవీఐ యూనిట్లలోనే విధులు నిర్వహించవలసి ఉంటుంది. శనివారం నుంచే ఈ మార్పు అమల్లోకి వచ్చినట్లు రవాణాశాఖ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని వలు ప్రాంతీయ రవాణా కార్యాలయాలు, నాగోల్, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, కొండాపూర్ తదితర డ్రైవింగ్ టెస్ట్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తూ ఓడీలపైన చెక్‌పోస్టుల్లో పని చేస్తున్న సుమారు 15 మందితో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన మరో 80 మందికి పైగా ఎంవీఐలు, ఏఎంవీఐలు,కానిస్టేబుళ్ల ఓడీలు రద్దయ్యాయి. అక్రమాలకు అడ్డాలుగా మారిన చెక్‌పోస్టులలో పోస్టింగ్ కోసం గతంలో పెద్ద ఎత్తున పోటీపడ్డారు. ఇందుకోసం అప్పట్లో పైరవీలు సైతం జోరుగా సాగాయి. చెక్‌పోస్టు కొలువుల కోసం కొందరు పెద్దమొత్తంలో ముడుపులు చెల్లించినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. పలు కార్యాలయాల్లో పని చేసే మహిళా ఎంవీఐలు కూడా చెక్‌పోస్టు కొలువుల కోసం పోటీపడడం గమనార్హం. ప్రస్తుతం ఈ ఓడీలను ప్రభుత్వం రద్దు చేయడంతో అక్రమాలకు చెక్ పెట్టినట్లయ్యింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి

షాబాద్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. షాబాద్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధీమ్ కృష్ణయ్య(50) శనివారం తన వ్యవసాయ పొలం వద్ద బోరు నడవకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసేందుకు వెళ్లగా అక్కడ కింద తెగిపడిన విద్యుత్ వైరును గమనించకపోవడంతో షాక్ తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్: కుటుంబ కలహాలతో బావిలో దూకి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో శనివారం వెలుగు చూసింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీనివాస్(35), రవి అన్నదమ్ముళ్లు. వీరు శుక్రవారం కుటుంబ విషయాలపై ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ గ్రామ సమీపంలోని బావిలో దూకాడు. దీంతో మృతదేహం శనివారం ఉదయం నీటిపై తేలడంతో బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ బలవన్మరణానికి మద్యం మత్తు కారణమని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంచందర్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

ముగ్గురు నిందితుల రిమాండ్


ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితులు

రాజేంద్రనగర్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను శంషాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి బైక్, రెండు సెల్‌ఫోన్లు, 2 కిలోల 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉప్పర్‌పల్లిలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (డీటీఎఫ్) శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, దేవేందర్ రావు వివరాలను వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఆజం పటేల్, బిహార్‌కు చెందిన అనిల్‌కుమార్, హర్యానాకు చెందిన ఖలీల్ బతుకు దెరువు నిమిత్తం కాటేదాన్ ప్రాంతానికి వలసవచ్చి ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో గంజాయి విక్రయించాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ఆజం పటేల్, అనిల్ కుమార్, ఖలీల్ బైక్‌పై నగరు శివారు నుంచి ఓ వ్యక్తి వద్ద నుంచి 2.700 గ్రాముల ఎండు గంజాయిని కొనుగోలు చేసి. శనివారం ఉదయం గగన్‌పహాడ్ మీదుగా కాటేదాన్ తీసుకొస్తుండగా రూట్ వాచ్‌లో భాగంగా డీటీఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై శ్రీకాంత్ తన బృందంతో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. బ్యాగ్‌లో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఎక్కడైనా గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

టీకేఏ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రాజ్యలక్ష్మి


నియామక పత్రం అందుకుంటున్న రాజ్యలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కబడ్డీ సంఘం (టీకేఏ) మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా డి.రాజ్యలక్ష్మి నియమితులయ్యారు ఈ మేరకు ఆమె టీకేఏ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. టీకేఏ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ హోదాలో ఆమె తెలంగాణలోని మహిళా కబడ్డీ ప్లేయర్ల వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. రాష్ట్రంలో జరిగే అన్ని కబడ్డీ టోర్నమెంట్‌లకు హాజరవుతారు.

31న డ్రంకెన్ డ్రైవ్‌లతో పాటు ప్రత్యేక తనిఖీలు

రాజేంద్రనగర్: డిసెంబర్ 31న రాజేంద్రనగర్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లతో పాటు ప్రత్యేక తనిఖీలను నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ వెల్లడించారు. రాజేంద్రనగర్‌లోని ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ..31వ తేదీ రాత్రి 8 గంటల నుంచి పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేతో పాటు ఓఆర్ఆర్‌పై నిషేధం ఉంటుందన్నారు. కేవలం ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారు ఎయిర్‌పోర్టుకు సంబంధించిన పత్రాలను తనిఖీ పోలీసులకు సూచించాలన్నారు. రాత్రి 8 గంటల నుంచి 1వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ నిషేధం ఉంటుందన్నారు. ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు. వాహనాల తనిఖీలతో పాటు డ్రంకెన్ డ్రైవ్‌లు కొనసాగుతాయన్నారు.

దేవాలయం భూమి సర్వేపూర్తి

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని శ్రీరామచంద్రజీ దేవాలయం భూమి కబ్జా సర్వే పూర్తయింది. సర్వేనంబరు 668లో శ్రీ రామచంద్రజీ దేవాలయం భూమి మొత్తం7.18 ఎకరాల భూమి ఉంది. దేవాలయం ఉన్న ఈ భూమిలో ఇరువైపులా అక్రమార్కులు కబ్జా కు పాల్పడ్డారు. గతంలో రెండు సర్వేలు పూర్తి చేయించిన దేవాదాయ శాఖ అధికారులు తాజాగా శనివారం ఈవో మోహన్ రావు ఆధ్వర్యంలో ఏడీ సర్వే చేయించారు. ఆలయానికి ఇరువైపులా, వెనక భాగంలో కబ్జాకు గురికావడంతో రెవెన్యూ సర్వేతో పాటు ఏడీ సర్వే చేయించినట్లు ఈవో మోహన్ రావు తెలిపారు. గగన్‌పహాడ్ పరిధిలో ఉన్న ఆలయ భూములపై కూ డా కోర్టుతో పాటు ట్రిబ్యునల్‌లో కేసు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారం రోజులో వాస్తవ నివేదిక అందనున్నటు అధికారులు తెలిపారు.

రాజీ మార్గమే ఉత్తమం

రాజేంద్రనగర్: రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమా అన్నారు. రాజేంద్రనగర్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఈ జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 14,810 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో 12వ అదనపు న్యాయమూర్తి రాజ్ కిరణ్, 13వ న్యాయమూర్తి అంకిత్ సర్వ, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి నజీరుద్దీన్, ఏపీపీలు శీనయ్య, ప్రవీణ్ నాయక్, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరి ప్రసాద్ రెడ్డి, కార్యదర్శి రామకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ స్టేట్ సెయిలింగ్ రెగట్టా విజేతగా లాహిరి

రాంగోపాల్‌పేట్: తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ రెగట్టా టోర్నమెంట్‌లో లాహిరి కొమురవెల్లి విజేతగా నిలిచింది. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో శనివారం ముగిసిన టోర్నీలో లాహిరి సబ్ జూనియర్ విభాగంలో స్వర్ణం దక్కించుకుంది. ఈమె అక్క దీక్షిత కొమురవెల్లి రెండు స్థానంలో రజతం సాధించింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో అక్కా చెల్లెళ్లు చెరో 15 పాయింట్లు సాధించారు. తక్కువ వయసు, బరువు ఉన్న లాహిరి 5 రేసులు గెలుచుకోగా, దీక్షిత 4 రేసుల్లో మాత్రమే నెగ్గింది. సబ్ బాలుర విభాగంలో బన్నీ బొంగుర్, వినోద్‌దండు, రిజ్వాన్ మహ్మద్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఓవరాల్ పాయింట్లలో బాలికల కంటే వెనుకబడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో యాచ్‌క్లబ్ అధ్యక్షులు సుహేమ్ షేక్ మాట్లాడుతూ క్రీడలతో గౌరవం అనే ట్యాగ్‌లైన్‌తో బాలికల కోసం తాము అందించిన శిక్షణ గొప్ప ఫలితాలను సాధించిందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ విజేతలకు బహుమతులు అందజేశారు.